క్లుప్తంగా

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చండి



సత్తెనపల్లి: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలసిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్ల పై ఉందని సత్తెనపల్లి టౌన్ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో గ్యారేజీలో మంగళవారం ఆర్టీసీ, హయ్యర్ బస్ డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అనే ఉద్దేశంతో ఎక్కువ మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తూ ఉంటారన్నారు. ఈ మధ్య ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు నియమ నిబంధనలను పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌పీవీ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



నకరికల్లు: ప్రతిభను ప్రోత్సహించడంలో గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎస్ఐ పఠాన్ రబ్బాని ఖాన్ అన్నారు. గుండ్లపల్లిలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన నలుగురిని సన్మానించడంతో పాటు 2024–25 పదోతరగతి పరీక్షల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్‌హ్యాండ్స్ స్థాపించి తమ గ్రామంలోని ప్రతిభను అభినందించడం, సేవాకార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సహకరిస్తున్న గుత్తికొండ మీరా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణీంద్ర, జూపల్లి మోషె, ఫౌండేషన్ అధ్యక్షుడు చందా మీరా, కార్యదర్శి హిమామ్‌వలి, గుత్తికొండ మీరా, సుభాని, సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



నాదెండ్ల: మైనర్ బాలికల వివాహం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు నిండిన బాలికలు మాత్రమే వివాహానికి అర్హులని నీడ్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ చెప్పారు. చందవరం ప్రాథమిక పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మైనర్ బాలికలకు వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రభుత్వ అధికారులకు సమాచారమివ్వాలని ప్రజలను కోరారు. బాలికలకు చక్కగా చదివించి వారు జీవితంలో స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సతీష్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, ఇస్రాయేలు, అంగన్‌వాడీ కార్యకర్త వెంకట కోమలి, స్థానికులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో సత్ఫలితాలు

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బోధనోపకరణాలు ద్వారా విద్యార్థులు బోధించడంతో మంచి ఫలితాలు వస్తాయని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఛాయచిత్రాలు ద్వారా విద్యార్థులకు బోధించటం ద్వారా సులువుగా అర్థంమౌతుందన్నారు. రోజు వారి బోధనలు టీఎల్‌ఎంతో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి విద్యార్థుల ప్రగతి పత్రాలు వ్యక్తిగతంగా ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్, దూపాటి అనుసూయ సీఆర్‌పీ ఏడుకొండలు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నరసరావుపేట రూరల్: గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో రావిపాడు రోడ్డులో రూరల్ ఎస్ఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ముప్పాళ్ల మండల కేంద్రానికి చెందిన పఠాన్ చాంద్‌బాషా పోలీసులకు తారసపడ్డాడు. అతని వద్ద పరిశీలించగా 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. గతంలో కూడా నిందితుడిపై గంజాయి రవాణా కేసు ఉన్నట్టు పోలీసులు విచారణలో తెలిసింది. ఒరిస్సాకు చెందిన వ్యక్తి ద్వారా గంజాయిను తెప్పించి స్థానికంగా అమ్మకాలు జరుపుతున్నట్టు నిందితుడు వెల్లడించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త





క్రోసూరు మండలంలో రోడ్డు పక్కన ఉన్న నేలబావులు

- క్రోసూరులో సుమారు 20 నేలబావులు
- వాటి వద్ద అప్రమత్తంగా ఉండాలి
- రైతులు రక్షణ ఏర్పాట్లు చేయాలి

క్రోసూరు: మండలంలో పలుచోట్ల నేలబావులు ప్రమాదకరంగా మారాయి. రైతాంగ అవసరాల కోసం పొలాల్లో, రోడ్ల పక్కన ఉన్న పొలాల్లో బావులు తవ్వించుకుని నీటిని వాడుతుంటారు. వాటి వద్ద ఎటువంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. మండలంలోని 21 గ్రామాలుంటే సుమారు 20 వరకు నేల బావులున్నాయి. వీటిని రైతుల అవసరాల మేరకు వినియోగించుకుంటున్నారు. కానీ చుట్టూ రక్షణ లేదు. రైతులు ఆ బావులను వినియోగించుకుని వెళ్లిపోతున్నారు. అలా చేయడం ఎంత ప్రమాదమో.. అయినా పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలంటున్నారు.

రాత్రి వేళ మరింత ప్రమాదం

వర్షాకాలంలో ఆ బావులు మరింత నిండుగా కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో అటుగా వెళ్లే పశువులు, మనుషులు వాటిలో పడితే అంతే సంగతులు. పనులకు వెళ్లే కూలీలు, చిన్నపిల్లలు ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్నా.. ప్రమాదవశాత్తు ఇటువంటి నేల బావుల్లో పడితే ప్రాణాలపై ఆశలు వదులు కోవాల్సిందే. ఇటీవల జూన్ నెలలో విప్పర్ల గ్రామ పరిధిలో నేల బావిలో పడిపోయి ఎర్రగుండ్ల ప్రకాశ్ అనే 8 ఏళ్ల బాలుడు మృతి చెందిన సంగతి విదితమే. గతంలో అనేక చోట్ల రాష్ట్రంలో బోరు బావుల్లో, నేలబావుల్లో పడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. రైతులు పొలాల్లో ఉన్న నేలబావుల చుట్టూ రక్షణ ఏర్పాట్లుగానీ చేయాలని ప్రజలు, అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులు బావుల చుట్టూ రక్షణ చర్యలు ఏర్పాటుచేయాలి



రైతులు వ్యవసాయ బావులు, ఓపెన్ బావుల వద్ద రక్షణ ఏర్పాటుచేయడం లేదు. బావుల వద్ద ఎలాంటి సంకేతాలు ఏర్పాటుచేయడం లేదు. ఈ కారణంగా చిన్నపిల్లలు, పశువులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రైతులు బాధ్యత తీసుకొని వారి ఓపెన్ బావుల చుట్టూ రక్షణ గోడలు, ఫెన్సింగ్ తప్పని సరిగా ఏర్పాటు చేయాలి.

– తహసీల్దార్ వి.వి.నాగరాజు, క్రోసూరు

మహిళల ఆరోగ్యానికే వైద్య శిబిరాలు

క్రోసూరు: మహిళల ఆరోగ్యానికే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. అన్ని సచివాలయాల్లో బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు గఫ్రూన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ప్రొవైడర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ గఫ్రూన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆరోగ్యవంతమైన స్త్రీ, శక్తివంతమైన కుటుంబం అమలుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు, వైద్య సలహాలు అందిస్తారన్నారు. మహిళలకు అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్, పోషణ అభియాన్, తల్లి బిడ్డల సేవలు, కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, వయోవృద్ధుల ఆరోగ్య సేవలు, మానసిక వైద్య సేవలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబాలు బాగుటాయని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ నారీ స్వశక్తి కార్యక్రమంపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పొలురవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవితేజనాయక్

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభయాన్ ' కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో కార్యక్రమంపై వివిధ గ్రామాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి దీపిక, సూపర్‌వైజర్ బాషా, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

బృగుబండ సొసైటీలో 19.8 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

సత్తెనపల్లి: మండలంలోని బృగుబండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) లో మంగళవారం 19.8 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి తెలిపారు. పీఏసీఎస్‌కు 19.8 మెట్రిక్ టన్నుల యూరియా రావడంతో ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున స్లిప్పులు పంపిణీ చేసి బృగుబండ, కందులవారిపాలెం గ్రామాలకు చెందిన 440 మంది రైతులకు యూరియాను అందించామని పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

క్రోసూరు: మండలంలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతున్నట్లు క్రోసూరు ఇన్‌చార్జి తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో మొత్తం 19703 స్మార్ట్ రేషన్‌కార్డులు అందుబాటులోకి వచ్చాయని వాటిని ఆయా గ్రామాల వీఆర్వోలకు అందజేసినట్లు వివరించారు. వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్ల ద్వారా స్మార్ట్‌కార్డులు అందజేస్తారని తెలిపారు.

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాల రేషన్ డీలర్లకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ, టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

బోధనకు ప్రతికూలం.. 'అసెస్‌మెంట్ బుక్‌లెట్'

యూటీఎఫ్ పల్నాడు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కిషోర్

సత్తెనపల్లి: బోధనకు ప్రతికూలంగా మారిన అసెస్‌మెంట్ బుక్‌లెట్ ప్రశ్నాపత్ర విధానాన్ని రద్దు చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పల్నాడు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కిషోర్ అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన రణభేరి కార్యక్రమం కరపత్రాలను మంగళవారం పట్టణంలోని మండల విద్యా వనరుల కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి 30 శాతం తాత్కాలిక భృతిని మంజూరు చేయాలన్నారు. రణభేరి విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులను సంసిద్ధం చేస్తూ బయలుదేరిన యూటీఎఫ్ రాష్ట్ర ప్రచార జాత ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి చేరుకుంటుందన్నారు. ఈ ప్రాంత ఉపాధ్యాయులు ప్రచార జాతలో పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నంబుల విష్ణుమూర్తి మాట్లాడుతూ ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, పేరుకుపోయిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. యాప్‌లను రద్దు చేయాలని కోరుతూ రణభేరి నిర్వహిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 15 నెలలు గడిచినా ఏ ఒక్క ఆర్థిక పరమైన సమస్యను పరిష్కరించలేదన్నారు. యూటీఎఫ్ బాధ్యులు రవీంద్రనాథ్ ఠాగూర్, భద్రయ్య, ఆనందరావు, బి వెంకట్రావు, శేషగిరి, తాజుద్దీన్, సురేష్, వైఎస్సార్, సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మండల విద్యావనరుల కార్యాలయం వద్ద కరత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ బాధ్యులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

దాచేపల్లి: ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నారాయణపురంలో యూటీఎఫ్ రణభేరి వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ మంగళవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని చెప్పారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ని రద్దు చేసి ఓపీఎస్‌ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ దాచేపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజారావు, టి.ఆనంద్ కుమార్, కోశాధికారి జీవీ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కేవీ శ్రీనివాస్ రావు, మోజెస్, రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను విస్మరించిన కూటమి

సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోఉన్న మూడు జగనన్న కాలనీలు, మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న కాలనీల అభివృద్ధిని ఏడాదిన్నర నుంచి కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు విమర్శించారు. మంగళవారం స్థానిక మూడు జగనన్న కాలనీలను సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 18 గ్రామాల్లో జగనన్న కాలనీలు ఫేజ్ వన్, టు, త్రీలుగా విభజించి అర్హులైన నిరుపేదలకు స్థలాలను కేటాయించారు. అప్పట్లో కాలనీల్లో నివేశ స్థలాల లబ్ధిదారులు నివసించడానికి నీటి బోర్లు, కరెంట్, అంతర్గతంగా గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఏడాదిన్నరగా జగనన్న కాలనీలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం చిట్టిడవిని తలపిస్తోందన్నారు. ఇక్కడ వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్లు నిర్మించుకున్నా నివసించడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. నిరుపేదలకు ఇచ్చిన స్థలాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఎం రూరల్ కార్యదర్శి సయ్యద్ మోదీన్ వలి, పోలు, షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో పరిస్థితులను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

ఘనంగా హిందీ దివస్


వినుకొండ : మండలంలోని విఠంరాజుపల్లిలోని శ్రీ బాలాజీ ఐటీఐ కాలేజీలో మేరా యువ భారత్ (నెహ్రూయువ కేంద్రం) సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ సెక్రటరీ ఎన్. భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో హిందీ దివస్/పక్వాడా 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ వారు దేశవ్యాప్తంగా హిందీ దివస్ /పక్వాడ 2025 ప్రకటించారన్నారు.

విస్తృత పచ్చదనంతోనే ఓజోన్ సంరక్షణ

చిలకలూరిపేటటౌన్: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీజిల్, పెట్రోలు వంటి ఇంధనాల వాడకం తగ్గించి, సౌర విద్యుత్ వంటి వాటిని ప్రోత్సహించినప్పుడే పర్యావరణ పరిరక్షణ ఉంటుందన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ విస్తృతంగా మొక్కలు నాటి పరిసరాలను అరణ్యాలుగా మార్చినప్పుడే ఓజోన్ పొరను పరిరక్షించుకోగలమని తెలిపారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. హరితహారం అనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, ఏజీపీ దాసరి చిట్టిబాబు హాస్టల్ వార్డన్ కృపావతి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజమే ధ్యేయం

నూజెండ్ల: పొగాకు రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. శ్రీదేవి సూచించారు. మండల కేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పొగాకు రహిత విద్యాసంస్థలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంపై విద్యార్థులు నాటక ప్రదర్శన చేశారు. ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి మాట్లాడుతూ పొగాకు అవశేషాలు పాఠశాల ఆవరణలో లేకుండా చూడాలన్నారు. పొగాకు అలవాటు నుంచి యువతను దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పొగాకు వాడకంతో కలిగే దుష్ప్రభావాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మోతాదు మేరకు ఎరువులు వాడాలి

మాదల(ముప్పాళ్ళ): వరిలో మోతాదు మేరకు నత్రజని ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి నాటు దశలో, 30 రోజుల దశలో ఉందని, మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులను వినియోగించాలని తెలిపారు. వరిలో పైపాటుగా నత్రజని ఎరువులను నానో యూరియా రూపంలో పిచికారి చేయాలని సూచించారు. నానో యూరియా వినియోగిస్తే పంట దిగుబడుల్లో ఎలాంటి వ్యత్యాసం ఉండదని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శేషుబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాదలలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

నకరికల్లు: సిఫారసు మేరకే ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న పంటలకు విధిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. సిఫారసు మేరకే రసాయనిక ఎరువులు వినియోగించాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను పంటలకు పైపాటుగా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు మేరీ, రైతులు పాల్గొన్నారు.

గౌరవప్రదమైనది న్యాయవాద వృత్తి

సత్తెనపల్లి: సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైనది న్యాయవాద వృత్తి అని, యువ న్యాయవాదులు అంకితభావంతో పనిచేస్తూ ప్రతి ఒక్కరికి న్యాయ సహాయం చేయాలని లోక్ జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో యువ న్యాయవాదులకు సన్మానం చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ 100 మంది దోషులు శిక్ష నుంచి తప్పించుకోవచ్చు గాని ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదనే మూల సూత్రం ఆధారంగా ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా యువ న్యాయవాదులు నాగూర్‌బాబు, విజయభరత్, రామాంజనేయులు, లాజర్, నవజ్యోతిబాబును సన్మానించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు కొరబండి రాబర్ట్, మహంకాళి వెంకట్రావ్, షేక్ సుభాని, న్యాయవాదులు బాదినీడు శ్రీనివాస్ యాదవ్, పిల్లి సుధీర్ బాబు, తదితరులు ఉన్నారు.



సత్కారం అందుకున్న యువ న్యాయవాదులతో విజయ్‌కుమార్

ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ సమావేశానికి..



సమావేశానికి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగ నేతలు, కార్యకర్తలు

సత్తెనపల్లి: నరసరావుపేట పెద్ద చెరువుప్రాంతంలోని కాసు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సమావేశానికి నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త సహాయ కార్యదర్శి చిలుకా జైపాల్ ఆధ్వర్యాన పార్టీ ఎస్సీ సెల్ విభాగ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో నరసరావుపేట సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లారు. వారిలో మండల నాయకులు సంకటి శ్యాంసన్, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి చంటి, గుజ్జర్లపూడి కృపావరం, బోరుపోతు కోటయ్య, భట్లూరు చిన్న కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పీఎం శ్రీకేంద్రియ విద్యాలయ ఆవరణలో గడ్డి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ గుప్తా

సత్తెనపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా అన్నారు. సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో స్వచ్ఛత పక్వాడాను మంగళవారం పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ స్వచ్ఛత కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, జీవన విధానమన్నారు. మన ఇల్లు, పాఠశాల, సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. పరిశుభ్రతతో శక్తివంతమైన భారత్‌ను నిర్మించవచ్చన్నారు. పక్వాడాలో ప్రతిరోజూ విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారని తెలిపారు. వీటిలో స్వచ్ఛత శబ్ద దినోత్సవం, అవగాహన, గ్రీన్ స్కూల్ డ్రైవ్, కమ్యూనిటీ అవుట్ రీచ్ ప్రోగ్రాం, హ్యాండ్ వాష్, స్వచ్ఛత భాగస్వామ్య దినోత్సవం, వ్యక్తిగత స్వచ్ఛత, స్వచ్ఛత స్కూల్ ప్రదర్శన దినం వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పరిశుభ్రత ప్రాముఖ్యాన్ని సమాజానికి తెలియజేయడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. 30వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని గడ్డి మొక్కలను విద్యార్థులు తొలగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సత్కారాలతో బాధ్యత మరింత పెంపు

జిల్లా ఉత్తమ ఎంఈవో బాలసుందరరావు

బెల్లంకొండ: విధి నిర్వహణలో సత్కారాలు బాధ్యతను మరింత పెంచుతాయని జిల్లా ఉత్తమ ఎంఈవోగా ఎంపికైన ఎస్.బాలసుందరరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త నిర్వహణలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి సన్మానం చేశారు. జిల్లా ఉత్తమ ఎంఈవో బాలసుందరరావు, ఉత్తమ ఉపాధ్యాయులు షేక్ ఇమాంబి, బి.వెంకట పద్మావతి, నూతక్కి సుజాత జ్యోతి, బి.హృదయరాజులను సత్కరించారు. బాలసుందరరావు మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయుల కృషికి సత్కారాలే గుర్తింపు అని పేర్కొన్నారు. అనంతరం నంద సంకల్ప సేవా సమితి మాచాయపాలెం వారు ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు తాజుద్దీన్, ఉదయ్ కిరణ్, భానుమూర్తి, స్వాతి, దుర్గారావు, సత్యనారాయణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు